క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు హెచ్ఎంటీ హిల్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని అడ్డగుట్ట ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ అందజేత



లబ్ధిదారుడికి ఎల్ఓసీ అందజేస్తున్న వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు శనివారం లబ్ధిదారుడికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసినట్లు తెలిపారు.

ఈద్గాలో అన్ని సదుపాయాలు కల్పించాలి



ఈద్గా ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలో రంజాన్ మాసం సందర్భంగా ధర్మారెడ్డి ఫేజ్–2లోని ఈద్గాలో అన్ని సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అధికారులను కోరారు. ముస్లిం గ్రేవ్‌యార్డులో విశ్రాంతి భవనం, లైటింగ్, ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్‌లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పవిత్ర మాసంలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని సుమిత్రనగర్‌లో సత్యవేద ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ రోజాదేవి రంగారావుతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో రోజు రోజుకు ఎండలు విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రవి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ రక్షణ శాఖామాత్యుల సాంకేతిక సలహాదారుడు డాక్టర్ సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన, నవకల్పనలపై దృష్టి సారించాలన్నారు. దేశ భవిష్యత్ ప్రణాళికలకు అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి విద్యా సంస్థలు పునాది వేస్తున్నాయన్నారు. అనంతరం కళాశాల అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంత ఉన్నతికి ఎదిగినా తాము పుట్టి పెరిగిన పల్లెటూర్లను మరువరాదని, వాటి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రధాన కార్యదర్శి జె.శేషగిరిరావు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్‌టీఎస్ఓ పరీక్షల్లో శ్రీ చైతన్య సత్తా

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎన్‌టీఎస్ఓ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. ఈ పరీక్షల్లో తమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక శాతం బహుమతులు గెలుచుకున్నారని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ బీఎస్ రావు అభినందించారు.

ప్రభుత్వ స్కూళ్లలో.. అన్ని వసతులు కల్పిస్తున్నాం



రిక్షాపుల్లర్స్ కాలనీ పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ



పాఠశాలలో పూర్తయిన పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన బస్తీ–మన బడి కార్యక్రమంలో భాగంగా వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాలలో రూ.59.06 లక్షలతో కల్పించిన మౌలిక వసతులను మండల విద్యాధికారి ఆంజనేయులు, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన బస్తీ–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లి మండలం పరిధిలో24, కూకట్‌పల్లి మండలం పరిధిలో 7 పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో డీఈ దాసయ్య, ఏఈ ధీరజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్రకాంత్ రావు, మాచర్ల భద్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో..

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ హెచ్ఎంటీ వీకర్ సెక్షన్ కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాలలో రూ.53.58 లక్షల రూపాయలతో చేపట్టిన మౌలిక వసతులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాధవరం రోజాదేవి, మండల విద్యాధికారి ఆంజనేయులుతో కలిసి శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతుల కల్పనతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



ఇన్‌కార్ వన్‌సిటీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతున్న నేపథ్యంలో జేఎన్‌టీయూ నుంచి ఎస్‌బీఐ వరకు, జేఎన్‌టీయూ నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. శనివారం ఆయన ఆ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న జనాభా కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రజల సౌకర్యం కోసం ఇప్పటికే ఎమ్మెల్యే కృష్ణారావు కైత్లాపూర్ ఫ్లై ఓవర్, జేఎన్‌టీయూ ఫ్లై ఓవర్, 7వ ఫేజ్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చెన్నారెడ్డి, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, రఘునందన్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కార్ వన్‌సిటీలో పర్యటన..

ఇన్‌కార్ వన్ సిటీలో రోడ్ డైవర్షన్, ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టాలన్న అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు శనివారం ఆ ప్రాంతాన్ని కార్పొరేటర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. ఇన్‌కార్ వన్ సిటీ వద్ద ఫుట్‌పాత్ నిర్మాణం, ట్రాఫిక్ డైవర్షన్ కోసం వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నరసింగరావు, డీఈ ఆనంద్, అసోసియేషన్ సభ్యులు నరసింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమోహన్, పట్టాభి, ఏడుకొండలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ మహేందర్, మాజీ కార్పొరేటర్ బాబూరావు

మూసాపేట: మూసాపేట హనుమాన్ దేవాలయంలో హనుమాన్ శోభా యాత్ర పోస్టర్‌ను శనివారం కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, మాజీ కార్పొరేటర్ బాబూరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 6న సాయంత్రం 5 గంటలకు జనతానగర్ హనుమాన్ దేవాలయం నుంచి గూడ్స్ షెడ్ రోడ్డు హనుమాన్ దేవాలయం వరకు వీరహనుమాన్ శోభాయాత్ర ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని రామభక్తులు, యువజన సంఘాల నాయకులు రాజకీయాలకు అతీతంగా ఉన్న అన్ని పార్టీల వారు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, గోపాల్, అంజిగౌడ్, తూము వేణుగోపాల్, శ్రీరామదండు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతారామచంద్రులకు నాట్య నీరాజనం



కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, ఎంసీహెచ్ఎస్ సభ్యులు

మోతీనగర్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మోతీనగర్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కమ్యూనిటీహాల్‌లో సీతారామచంద్రుల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిషిక్తులైన సీతారామచంద్ర స్వామి వారికి నాట్య నీరాజనం కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన సుమధుర ఆర్ట్స్ అకాడమీ వారి కూచిపూడి నాట్యం ఆకట్టుకుంది. ఎంసీహెచ్ఎస్ అధ్యక్షుడు నల్లమాల్పు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేబీ రామకృష్ణ, సభ్యులు జి.వెంకటేశ్వరరావు, కంచర్ల శ్రీనివాసరావు, శ్రీదేవి, స్థానిక నాయకులు పుచ్చ శ్రీరామ్‌మూర్తి, నరేందర్, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

నిజాంపేట్: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని కార్పొరేటర్ కొలను వీరేందర్‌రెడ్డి అన్నారు. బాచుపల్లి 18వ వార్డులోని శ్రీ హోమ్స్ కాలనీలో శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా తదితర సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఇదే తరహాలో అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

'మౌలిక వసతులు కల్పించలేని స్థితిలో ప్రభుత్వం'



ఆల్విన్‌కాలనీ డివిజన్ పర్యటిస్తున్న బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో కొనసాగుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ పాదయాత్ర శనివారం జలకన్య హోటల్ నుంచి తులసినగర్, శ్రీ తులసినగర్, వాంబే గృహాలు, భూదేవి హిల్స్, తదితర ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మోసపూరిత విధానాలను ఇంటింటికి తెలియజేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలకు నూతన రేషన్ కార్డులు, పింఛన్లు, రెండు పడకల ఇళ్లు ప్రజలకు కలగానే మిగిలిపోయాయన్నారు. ప్రజలకు కనీసం మౌలిక వసతులు కల్పించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. కమీషన్లు, కాంట్రాక్టులు, కబ్జాలు, బెదిరింపులతో ప్రజాప్రతినిధులు పరిపాలన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రామరాజు, మణిభూషణ్, కుమార్‌యాదవ్, విజిత్‌వర్మ, కమలాకర్‌రెడ్డి, రవీందర్‌రావు, వేణుగోపాల్‌యాదవ్, నర్సింగ్ రావు, భూపాల్‌రెడ్డి, పర్వతాలుయాదవ్, రాధాకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలు కేసీఆర్‌కు బుద్ధి చెప్పడం ఖాయం'

నిజాంపేట్: కేసీఆర్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న మోసం మర్చిపోలేనిదని, వచ్చే ఎన్నికల్లో బీసీలంతా కేసీఆర్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అన్నారు. ప్రగతినగర్‌లోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంటింటికి ఓబీసీ మోర్చా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీసీలందరూ కేసీఆర్ చేస్తున్న అన్యాయాలను గుర్తించారని, సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారన్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

నిజాంపేట్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తోందని నిజాంపేట్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం బాచుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆయన కోడిగుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. 19వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్తిరెడ్డి, రాజేందర్ రెడ్డి, అంగన్వాడీ పాఠశాల సూపర్‌వైజర్ రేణుక, అంగన్వాడీ పాఠశాల ఉపాధ్యాయురాలు, ఇతరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని నిరుద్యోగుల కోసం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 10 వేల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. సుమారు 108 కంపెనీలు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. కూకట్‌పల్లిలోని మెట్రో ట్రక్ పార్కు వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా ఉంటుందన్నారు. పదవ తరగతి నుంచి డిగ్రీ, పీజీ, టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులు చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.6.11 లక్షలు విరాళం

గచ్చిబౌలి: కొత్తగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.6.11 లక్షలు విరాళంగా అందజేశారు. విద్యుత్ పెండింగ్ బిల్లులు, ఫ్యాన్లు, బల్బుల ఏర్పాటుకు మారీటెక్ ఫౌండేషన్, రక్తపు సందీప్ గౌడ్ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మా ఊరి పాఠశాలను మేమే అభివృద్ధి చేసుకుంటామనే లక్ష్యంతో మరి కొందరు దాతలు ముందుకు రావడం అభినందనీయమని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్ పేర్కొన్నారు. బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాతవ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, రక్తపు కృష్ణ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మహిళ ఆత్మహత్య

భాగ్యనగర్‌కాలనీ: జీవితంపై విరక్తి చెందిన మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబంతో కలిసి నేపాల్ నుంచి బతుకు తెరువు కోసం నగరానికి వచ్చిన నర్మద (38) కూకట్‌పల్లి వైష్ణవినగర్‌లో నివాసం ఉంటుంది. నర్మద తల్లిదండ్రులతో పాటు అత్తను అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. వీరిని హాస్పిటల్‌లో చూపించినప్పటికీ నయం కావడం లేదు. అప్పు తీసుకొచ్చి వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో మానసికంగా కుంగిపోయిన నర్మద తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆమె భర్త భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.